సాక్షి ప్రకాశం

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



గతమెంతో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ట్రాన్స్‌పోర్ట్, ఆటోమొబైల్ రంగంలో సింగరాయకొండ ఒక వెలుగు వెలిగింది. నేడు పలు కారణాలతో తన ప్రాభవం కోల్పోతోంది.

- 8లో..



మాదకద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు

మాదకద్రవ్యాల వాడకాన్ని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ పరమేశ్వరరెడ్డి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు అర్బన్: కొత్తగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పీ పరమేశ్వరరెడ్డి బుధవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీసు శాఖ, పరిపాలక అధికార యంత్రాంగం మధ్య సమన్వయం, జిల్లాకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. రాబోయే ఎన్నికలు జిల్లాలో శాంతియుతంగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు ఉన్నారు.

గిరిజన అభ్యర్థులకు గ్రూప్-1 పరీక్షలకు ఉచిత శిక్షణ

పెద్దదోర్నాల: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలోని గ్రూప్-1 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న షెడ్యూల్ ట్రైబ్స్ (చెంచు, సుగాలీ, ఎరుకల, యానాది) అభ్యర్థులకు గ్రూప్-1 లో ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి తెలిపారు. దరఖాస్తుతో పాటు బయోడేటా ఫారం, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, గ్రూప్-1కి దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ ఫారం తదితర పత్రాలను సమర్పించాలని ఆయన కోరారు. దరఖాస్తులను ఈ నెల 18 తేదీ సాయంత్రం 5 గంటల లోపు శ్రీశైలంలోని ఐటీడీఏ ప్రాజెక్టు కార్యాలయంలో అందించాలన్నారు.

జగనన్న నమ్మకమే వలంటీర్ వ్యవస్థ

- వలంటీర్ పరిచయ కార్యక్రమంలో మంత్రి మేరుగు నాగార్జున



సచివాలయం వారీగా వలంటీర్లతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

నాగులుప్పలపాడు: జగనన్న ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైన్యమే వలంటీర్ వ్యవస్థ అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మండల వ్యాప్తంగా 20 సచివాలయాల పరిధిలో ఉన్న వలంటీర్లతో బుధవారం నాగులుప్పలపాడులో ఏర్పాటు చేసిన ముఖాముఖి పరిచయ కార్యక్రమంలో మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడారు. వ్యవస్థల్లో మార్పు కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ఎంతో ప్రయోజనకరంగా ఉందని, అలాంటి వ్యవస్థను నిర్వర్యం చేయడానికి ఎల్లో మీడియా లేనిపోని అబద్ధపు కథనాలు వండివారుస్తోందని దీనిని అధిగమించేందుకు మనందరం కలిసి ఇంకా శ్రమించాల్సి ఉందన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి తాను కూడా భాగమై తోడ్పాటుగా ఉంటానన్నారు.

అనంతరం సచివాలయం వారీగా ప్రతి వలంటీర్లను పరిచయం చేసుకొని సమస్యలు ఏమైనా ఉంటే తనతో నేరుగా మాట్లాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీడీవో మహాలక్ష్మి, కార్పొరేషన్ డైరెక్టర్లు కంచర్ల సుధాకర్, పేరాల చెన్నకేశవులు, వైస్ ఎంపీపీ కన్నా రాధ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేద గుండెకు అభయం

ఒంగోలు సర్వజన ఆస్పత్రి శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. సూపర్ స్పెషాలిటీ వైద్యం పేదలకు అందుతోంది. తాజాగా క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ల్యాబ్ ఏర్పాటు పనులు చకచకా జరుగుతున్నాయి. గుండె జబ్బుల వైద్యానికి సంబంధించి ఇప్పటి వరకూ ప్రాథమిక పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో సంపూర్ణ వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. నిరుపేద, మధ్య తరగతులకు చెందిన హృద్రోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

- ఒంగోలు జీజీహెచ్‌లో క్యాథ్‌ల్యాబ్
- గుండె జబ్బులకు సంపూర్ణ వైద్యం
- యాంజియోగ్రామ్‌లు, స్టెంట్‌లు ఇక్కడే
- గుంటూరు జీజీహెచ్‌లో సిబ్బందికి శిక్షణ
- ఫలించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రయత్నాలు



ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట



గతంలో ఏ ప్రభుత్వం కూడా ప్రజల ఆరోగ్యానికి ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నిరుపేద, మధ్య తరగతి సామాన్య ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని అనేక పథకాలను అమలు చేస్తోంది. ఒంగోలు జీజీహెచ్‌కు ఏడాదికి 538 మందికి పైగా గుండెపోటులో చికిత్స కోసం వస్తున్నారు. ఇక్కడ యాంజియోగ్రామ్ లేకపోవడం అనేది ఇబ్బందిగా తయారైంది. దీని కోసం ప్రజలు గుంటూరుకు వెళ్లాల్సి వస్తుందన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లాం. ఇపుడు క్యాథ్‌ల్యాబ్ మంజూరు చేయడం వలన ఎంతో విలువైన సమయం వృథా కాకుండా హృద్రోగులకు చికిత్స చేయడానికి, తద్వారా వారి ప్రాణాలను కాపాడడానికి అవకాశం ఉంటుంది. ఆపత్కాలంలో ప్రజలను ఆదుకోవడం మా బాధ్యతగా భావిస్తున్నాను.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే

గుంటూరు జీజీహెచ్‌లో సిబ్బందికి శిక్షణ

ప్రస్తుతం ఒంగోలు జీజీహెచ్‌లో కార్డియాలజీ విభాగంలో ఒక కార్డియాలజిస్టు ఉన్నారు. ఒక కార్డియాలజీ టెక్నీషియన్, క్యాథ్‌ల్యాబ్ టెక్నీషియన్లు ఇద్దరు, ఈసీజీ టెక్నీషియన్లు 8 మంది, పర్‌ఫ్యూజనిస్టులు ఇద్దరు ఉన్నారు. టెక్నీషియన్లకు త్వరలో గుంటూరు జీజీహెచ్‌లో శిక్షణ ఇప్పించనున్నారు.

ఒంగోలు టౌన్: ఒంగోలు రిమ్స్ (జీజీహెచ్)కు ఉమ్మడి ప్రకాశం జిల్లాల నుంచి చికిత్స నిమిత్తం పెద్ద ఎత్తున రోగులు తరలివస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి రోగులు వస్తుండడంతో అందుకు అవసరమైన వసతి సౌకర్యాలను ప్రభుత్వం సమకూరుస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం ఆస్పత్రి అభివృద్ధిని గాలికొదిలేసింది. అంతంత మాత్రంగానే వైద్యసేవలందేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయి. అత్యాధునిక వైద్యసేవలు సైతం అందుబాటులోకి వచ్చాయి. సూపర్ స్పెషాలిటీ వైద్యం కూడా పేదలకు అందుబాటులోకి వచ్చింది. తాజాగా క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీజీహెచ్‌లోని 120 నంబరు గదిలో దీనిని ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలో యాంజియోగ్రామ్ పరీక్షలతో పాటుగా అవసరాన్ని బట్టి స్టెంట్లు సైతం వేయనున్నారు.

ఫలించిన బాలినేని ప్రయత్నం:

ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రోజుకు నలుగురికి పైగా గుండెపోటుతో చికిత్స కోసం వస్తున్నారు. ఇక్కడ యాంజియోగ్రామ్ పరీక్ష సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజు కనీసం ఇద్దరిని గుంటూరు జీజీహెచ్‌కు రెఫర్ చేస్తున్నారు. చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ వివరాలను పరిశీలిస్తే గత ఐదేళ్లలో దాదాపు 30 వేల మంది గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. రిమ్స్‌లో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు ఆవశ్యకతను అధికారులు బాలినేనికి వివరించారు. ఇదే విషయాన్ని ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే క్యాథ్‌ల్యాబ్ మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తొలుత కాకినాడ, కర్నూలులో పాత క్యాథ్‌ల్యాబ్ స్థానంలో కొత్తవి మంజూరు చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రితో మాట్లాడి ఇక్కడ పరిస్థితిని వివరించి చెప్పడంతో వెంటనే ల్యాబ్ మంజూరు చేశారు.



ఒంగోలు జీజీహెచ్

యాంజియోగ్రామ్ పరీక్షే కీలకం:

గుండె జబ్బులను నిర్ధారించడంలో యాంజియోగ్రామ్ ఎంతో కీలకమైంది. ఇది ఆపరేషన్ కాదు కేవలం ఒక పరీక్ష మాత్రమే. గుండెనొప్పి వచ్చిన వ్యక్తుల గుండెలోని రక్త నాళాల పరిస్థితిని ఇది తెలియజేస్తుంది. గుండెలో ఎడమ వైపున రెండు, కుడి వైపున ఒకటి రక్తనాళాలు మొత్తం మూడు రక్త నాళాలు ఉంటాయి. ఇందులో బ్లాకులు ఏర్పడినప్పుడు గుండెనొప్పి లేదా గుండెపోటు వస్తుంది. యాంజియోగ్రామ్ పరీక్ష చేసి బ్లాకులను పరిశీలించిన తరువాత అవసరాన్ని బట్టి యాంజియోప్లాస్టీ చేస్తారు. దీనినే స్టెంట్లు వేయడం అంటారు. అంటే క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేయడం వలన యాంజియోగ్రామ్ పరీక్షలతో పాటుగా కరోనరీ యాంజియోప్లాస్టీ ఆపరేషన్ కూడా చేయవచ్చన్న మాట. క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక వైద్యం అందుబాటులోకి వస్తుంది



గుండెపోటుతో చికిత్స కోసం జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి కూడా అనేక మంది జీజీహెచ్‌కు వస్తున్నారు. స్టెమీ కార్యక్రమంలో భాగంగా కూడా ఇక్కడికి అనేక మందిని రెఫర్ చేస్తున్నారు. అయితే యాంజియోగ్రామ్ సౌకర్యం లేకపోవడంతో కొంతమందిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించాల్సి వస్తోంది. దాంతో కాలయాపన జరుగుతోంది. ఇప్పుడు ఇక్కడ క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేయడం వలన సాధ్యమైనంత త్వరగా బాధితుడికి అవసరమైన వైద్యం చేసే అవకాశం ఉంది. ప్రాణాలను కాపాడేందుకు అవకాశాలు మెరుగవుతాయి.

– డాక్టర్ కుంచాల వెంకటేశ్వరరావు, కార్డియాలజిస్ట్, జీజీహెచ్.

సాంకేతిక సదుపాయాల ఏర్పాట్లు జరుగుతున్నాయి



క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేయడం వలన ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే హృద్రోగులకు పూర్తి వైద్యం అందుబాటులోకి వస్తుంది. అత్యంత ఆధునిక పరికరాలతో వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. ఇక నుంచి యాంజియోగ్రామ్ కోసం గుంటూరుకు వెళ్లాల్సిన అవసరం రాదు కనుక నిరుపేద ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుతం సాంకేతికంగా అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. మార్చి చివరికల్లా పూర్తిగా క్యాథ్‌ల్యాబ్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పూర్తిస్థాయిలో క్యాథ్‌ల్యాబ్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ భగవాన్ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

పేదలందరికీ న్యాయం జగనన్నతోనే సాధ్యం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి



బాలినేని, చెవిరెడ్డిలను గజమాలలతో ఘనంగా సత్కరిస్తున్న నాయకులు

- బూచేపల్లి కుటుంబానికి మంచి పేరు ఉంది
- ఇండిపెండెంట్‌గా గెలిచిన గొప్ప వ్యక్తి బూచేపల్లి సుబ్బారెడ్డి
- ప్రజల కోరిక మేరకు సీఎం జగన్ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థిగా శివప్రసాద్ రెడ్డిని ప్రకటించారు
- గతంలో కంటే రెట్టింపు మెజార్టీతో ఆయన్ను గెలిపించండి
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

దర్శి: పేదలందరికీ న్యాయం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వారికి ఘన స్వాగతం పలికారు. గజమాలలు మెమొంటోలతో సత్కరించారు. పార్టీ కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ కార్యాలయాన్ని బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ రూంలను చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలే వైఎస్సార్‌సీపీ సంపూర్ణ విజయం సాధించడానికి కారణం అవుతాయన్నారు. మొదటి నుంచి బూచేపల్లి కుటుంబానికి మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని చెప్పారు. బూచేపల్లి సుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా గెలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. నియోజకవర్గ ప్రజలందరూ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యేగా కోరుకున్నారని, అందుకే సీఎం జగన్.. ఆయనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించారన్నారు. పార్టీలో గ్రూపులు, విభేదాలు లేకుండా పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో అన్నీ సీట్లు వైఎస్సార్ సీపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో 175కి 175 సీట్లతో జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయమని చెప్పారు. భగవంతుని ఆశీస్సులతో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో గతంలో కంటే రెట్టింపు మెజార్టీలో గెలిపించాలని కార్యకర్తకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్యవిభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, దర్శి, దొనకొండ, ముండ్లమూరు, ఎంపీపీలు సుధా అచ్చయ్య, బొరిగొర్ల ఉషామురళి, సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి, బెల్లం సురేష్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ఎన్ఆర్ఈడీ డైరెక్టర్ సానికొమ్మ తిరుపతిరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మారెడ్డి సుబ్బారెడ్డి, కాపా రమణారెడ్డి, మండల పార్టీ కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, తూము వెంకట సుబ్బారెడ్డి, యన్నాబత్తిన వెంకటసుబ్బయ్య, జేసీఎస్ కన్వీనర్లు గుంటు పోలయ్య, బత్తినేని వెంకటేశ్వర్లు, మేరువ సుబ్బారెడ్డి, యాడిక శ్రీనివాసరెడ్డి, ఎదురు కోటిరెడ్డి, జెడ్పీటీసీలు తాతపూడి రత్నరాజు, నుసుం నాగిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాం భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు కొరివి ముసలయ్య, సోముదుర్గారెడ్డి, యడమకంటి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభం, బొడ్డు రాయి ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, మేరుగు నాగార్జున

- వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి, మాజీ మంత్రి బాలినేని, ఇన్‌చార్జి మంత్రి మేరుగు



ప్రతిష్ఠా వేడుకల్లో పాల్గొన్న భక్తులు

చీమకుర్తి: సంతనూతలపాడులోని చెన్నకేశవస్వామి ఆలయం ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం ప్రతిష్ఠ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దానితో పాటు సంతనూతలపాడు గ్రామంలో బొడ్డు రాయి ప్రతిష్ఠ నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేరుగు నాగార్జున ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. సంతనూతలపాడుతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వేమా మల్లేశ్వరరావు, చెరుకూరి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, నూకసాని బాలాజీ, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు

- లే అవుట్‌లలో వేగంగా పనులు
- సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు
- కలెక్టర్ దినేష్‌కుమార్
- పనులు సత్వరం పూర్తిచేయాలన్న బాలినేని

ఒంగోలు అర్బన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఒంగోలు నగరంలోని పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. బుధవారం మల్లేశ్వరపురంలో ఇళ్ల పట్టాల భూముల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మల్లేశ్వరపురం, అగ్రహారం, వెంగముక్కపాలెంలో అన్నీ మౌలిక సౌకర్యాలతో లే అవుట్‌లలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు ముమ్మరం చేశామన్నారు. అన్నీ లే అవుట్‌లలో జంగిల్ క్లియరెన్స్, పెగ్ మార్కింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పట్టాల పంపిణీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇళ్ల పట్టాలతో పాటు కన్వేయన్స్ డీడ్స్ కూడా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీకి అవసరమైన 436 ఎకరాల భూమిని ఇప్పటికే సేకరించినట్లు తెలిపారు. వీటికి అవసరమైన సుమారు రూ.210 కోట్లను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిందన్నారు. సుమారు ఇరవై రెండు వేల మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి అధికార యంత్రాంగం రాత్రింబవళ్లు పనిచేస్తున్నట్లు తెలిపారు. భూములకు సంబంధించి లీగల్, రెవెన్యూ సమస్యలు పరిష్కారమైన వెంటనే 24 గంటల్లో సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా డబ్బు జమ చేస్తున్నామన్నారు. నష్టపరిహారం పొందే విషయంలో రైతులకు ఎటువంటి అనుమానాలు అవసరం లేదన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఒక టౌన్‌షిప్‌లా లే అవుట్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మల్లేశ్వరపురం, అగ్రహారం లే అవుట్‌కు 80 అడుగులతో అప్రోచ్ రోడ్డు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి రెండు వేల మందికి ఒక సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ సెంటర్, ప్రాథమిక పాఠశాల ఉండేలా చూస్తున్నామన్నారు. ప్రతి వంద ఇళ్లకు ఒక కామన్ పార్కింగ్ స్థలం కూడా ఉండేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు వంటివి కూడా పార్కింగ్ చేసేలా చూస్తామని చెప్పారు. వచ్చే వారంలో 20, 21వ తేదీల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి వచ్చే అవకాశం ఉందని తాత్కాలికంగా షెడ్యూల్ ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కన్వేయన్స్ డీడ్స్ కూడా ఇచ్చే కార్యక్రమానికి ఇక్కడ నుండే శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఇన్‌చార్జ్ ఆర్‌డీవో లోకేశ్వరరావు, మున్సిపల్ ఇంజినీర్ రహమత్ జానీ, హౌసింగ్ పీడీ పేరయ్య, సర్వే ఇన్‌స్పెక్టర్ పీ ప్రసాద్, తహశీల్దార్ సుజన్‌కుమార్ ఉన్నారు.



లే అవుట్‌లలో జరుగుతున్న పనులపై కలెక్టర్ దినేష్ కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

లే అవుట్ పనులపై కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్యే బాలినేని

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అహర్నిశలు కృషి చేసిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి పురోగతి, జరుగుతున్న పనులపై చర్చించారు. నగరం పరిధిలో 25 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి రూ.210 కోట్లు విడుదలైందని, పేదల ఇళ్ల స్థలాల కోసం భూములిచ్చిన రైతులకు వెంటనే పరిహారం అందజేయడం, లే అవుట్‌లలో జరుగుతున్న పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పేదలకు పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లపై చర్చించారు. అర్హులైన ప్రతి పేదకు ఇంటి స్థలం అందాలన్నారు. బాలినేనితో పాటు నగర మేయర్ గంగాడ సుజాత ఉన్నారు.

ఆగని పచ్చ కుట్రలు

- పేదల ఇళ్లపై హైకోర్టులో పిల్ వేసిన టీడీపీ నేతలు
- గతంలోనూ యర్రజర్ల లే అవుట్‌పై కోర్టుకు
- ఓటమి భయంతో టీడీపీ నేతల కుయుక్తులు
- ఎట్టి పరిస్థితుల్లో పట్టాలు పంపిణీ చేసేందుకు బాలినేని చర్యలు

ఒంగోలు అర్బన్: పేదల ఇళ్ల స్థలాలపై తెలుగుదేశం పార్టీ కుట్రలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒంగోలు నగరంలో నిరుపేదలు 25 వేల మంది సొంతింటి కల నెరవేర్చేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు టీడీపీ నేతలు న్యాయపరమైన చిక్కులు కల్పిస్తూ అడ్డు తగులుతున్నారు. గతంలో ఒకే చోట పట్టాలు ఇచ్చేందుకు యరజర్లలో లేఅవుట్‌ను సిద్ధం చేశారు. శాటిలైట్ సిటీ నిర్మించాలని చేసిన ప్రయత్నాలను అడ్డుకునేందుకు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఆయన అనుచరులు కుయుక్తులు పన్నారు. పట్టాలు పంపిణీ చేసే సమయంలో కోర్టుకెళ్లి అడ్డుకున్నారు. టీడీపీ నేతల కుట్రలను తిప్పికొడుతూ పేదల కల నెరవేర్చాలన్న సంకల్పంతో రైతుల దగ్గర నుంచి స్థలాలు కొనుగోలు చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించారు. ప్రభుత్వం రూ.210 కోట్లు విడుదలజేసింది. మల్లేశ్వరపురం, అగ్రహారం, వెంగముక్కపాలెం తదితర ప్రాంతాల్లో 436 ఎకరాలను సేకరించారు. రైతులకు నగదు సైతం చెల్లించారు. రేయింబవళ్లు పనులు చేస్తూ లే అవుట్‌లను సిద్ధం చేస్తున్నారు. త్వరలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇది జరిగితే తమకు రాజకీయ భవిష్యత్ ఉండదని భావించిన టీడీపీ మరో మారు పేదల ఇళ్లపై విషం చిమ్మింది. అంతా పారదర్శకంగా జరుగుతుంటే ఓర్వలేని వారు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా లేదంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఇది వారి కుట్రలకు అద్దం పడుతోంది. ఇదిలా ఉండగా ఈ పిల్ వేయడం వల్ల పేదల ఇళ్ల పట్టాల పంపిణీకి ఎటువంటి ఆటంకం ఏర్పడదని, త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

గిద్దలూరు కోడి పుంజులకు అవార్డు


అవార్డు అందుకుంటున్న తరుణ్

గిద్దలూరు రూరల్: కేరళ రాష్ట్రం పడక్కలూరులో నిర్వహించిన ఆలిండియా కోడిపుంజుల అందాల పోటీల్లో గిద్దలూరు వాసి తరుణ్‌కు చెందిన రెండు పుంజులకు అవార్డులు దక్కాయి. 27 నుంచి 30 ఇంచ్‌ల పొడవైన చిలకముక్కు కలిగిన పర్లా జాతి కోడి పుంజులు అందాల పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా కోడిపుంజుల యజమాని తరుణ్‌ను పలువురు అభినందించారు.

ప్రమాద రహిత డ్రైవర్లకు సత్కారం

ఒంగోలు: ప్రమాద రహితంగా తమ సర్వీసులో బస్సులు నడిపిన పలువురు డ్రైవర్లు, ఆర్టీసీ అధికారులు ఘనంగా సత్కరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రైవర్లకు నగదు అవార్డులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చే ఆర్టీసీలో పనిచేసే ప్రతి ఒక్కరూ గర్వపడాలన్నారు. దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తూ ఒక్క చిన్న ప్రమాదం కూడా చేయని వారిని మనం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అటువంటి వారిని సత్కరించడం ద్వారా ఆర్టీసీ తన ఆకాంక్షను స్పష్టం చేస్తుందన్నారు. ప్రజా రవాణా శాఖ అధికారి బి.సుధాకరరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలకుగాపైగా విధులు నిర్వహిస్తూ కూడా ప్రమాద రహితంగా బస్సు ప్రయాణం చేస్తున్న వారు ఆర్టీసీలో చాలా మంది ఉన్నారన్నారు. మాసోత్సవాల ముగింపు సందర్భంగా రీజియన్ పరిధిలో ముగ్గురు ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లను, ప్రతి డిపోలో ముగ్గురు చొప్పున ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించి వారికి నగదు బహుమతులు ఇచ్చి సత్కరించారు. ఏఎంవీఐ రవినాయక్, వన్‌టౌన్ సీఐ ఎం.లక్ష్మణ్, డిపో మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బావిలో పడి యువకుడు మృతి

ముండ్లమూరు: మండలంలోని ఈదరలో తిరుమలశెట్టి నాగేశ్వరరావు(34) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. నాగేశ్వరరావు బుధవారం పంటకు నీరు పెట్టేందుకు పొలం వద్ద ఉన్న బావి దగ్గరకు వెళ్లారు. విద్యుత్ మోటార్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడడంతో ఈత రాకపోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మోటార్ వేసేందుకు వెళ్లిన నాగేశ్వరరావు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పక్క పొలంలో ఉన్న మృతుడి బాబాయికి ఫోన్ చేసి బావి దగ్గరకు వెళ్లి చూసిరమ్మన్నారు. అక్కడికి వెళ్లి చూసే సరికి బావిలో శవమై కనిపించాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి పెద వెంకటరామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మద్దిపాడు: బైక్‌పై వెళ్తున్న యువకుడు.. గుర్తు తెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన మద్దిపాడులో ఫ్లయ్ ఓవర్ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. వెల్లంపల్లి రాజులమిట్టకు చెందిన అద్దేపల్లి హరీష్ వర్మ ఓ ఫార్మా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నాడు. మంగళవారం భార్య, కుమార్తెను వారి గ్రామమైన కందులూరులో విడిచి రాత్రి సమయంలో వెల్లంపల్లికి బైక్‌పై బయలుదేరాడు. మద్దిపాడు సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై శ్రీకాంత్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి రామరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు హరీష్ వర్మకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హరీష్ మృతితో వెల్లంపల్లి రాజులమిట్టలో విషాద ఛాయలు అలముకున్నాయి.

కొండ దిగిన బతుకు చక్రం..

- దశాబ్దం క్రితం వరకు లాజిస్టిక్స్ రంగంలో ఓ వెలుగు వెలిగిన సింగరాయకొండ
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ తర్వాత స్థానం సింగరాయకొండదే..
- రైలు రవాణా సౌకర్యం మెరుగవడంతో ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారంపై ప్రభావం
- డీజిల్ ధర పెరగడం, బాడుగలు లేకపోవడం, వర్కర్ల కొరతతో మరింత కుదేలు
- పదేళ్ల క్రితం 2 వేలకు పైగా లారీలు.. నేడు కేవలం 600 లారీలకే పరిమితం

సింగరాయకొండ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ట్రాన్స్‌పోర్ట్, ఆటోమొబైల్ రంగంలో ఒక వెలుగు వెలిగింది. రవాణా వ్యాపారంలో విజయవాడ తర్వాత అతిపెద్ద మార్కెట్ ఇక్కడే.. వేలాది లారీలు.. అంతే స్థాయిలో కార్మికులు.. వందల సంఖ్యలో ఆటోమొబైల్ దుకాణాలు వెరసి నిత్యం సందడి సందడిగా ఉండేది. మరిప్పుడేమైంది? ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారానికి కేంద్ర బిందువుగా ఉన్న సింగరాయకొండ క్రమంగా ప్రాభవం కోల్పోతోంది. కర్ణుడి చావుకు కారణాలు అనేకం అన్నట్టు ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం కుదేలవడానికీ చాలానే కారణాలున్నాయి. బతుకు చక్రం తిరోగమనమైంది.

– ఒంగోలు డెస్క్


సింగరాయకొండ లారీ యూనియన్ ఆఫీసు వద్ద కిరాయి లేక ఆగిన లారీలు

సింగరాయకొండ, మూలగుంటపాడు పంచాయతీలో ట్రాన్స్‌పోర్ట్, ఆటోమొబైల్ రంగంపై ఆధారపడి జీవించే వారి సంఖ్య ఎక్కువ. సింగరాయకొండ పంచాయతీ పరిధిలో డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్‌లు అధికంగా ఉండగా.. మూలగుంటపాడులో మాత్రం లారీ ఓనర్లు ఎక్కువగా ఉండేవారు. దీనికి తోడు ఇక్కడ పనిచేయడానికి రాష్ట్రం నలుమూలల నుంచి డ్రైవర్లు, క్లీనర్లు వచ్చేవారు. విజయవాడ తరువాత ఎక్కువగా నేషనల్ పర్మిట్ కలిగిన లారీలు కూడా సింగరాయకొండలోనే ఎక్కువగా ఉండటంతో దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఇక్కడ నుంచి రవాణా సౌకర్యం ఉండేది. ఇక్కడి లారీలను సుబాబుల్, జామాయిల్, ఉప్పు, మామిడి, సపోటా, పొగాకు, గ్రానైట్ ముడిరాళ్లు, గ్రానైట్ మార్బుల్స్, క్వార్ట్జ్, మత్స్య సంబంధ ఉత్పత్తుల రవాణాకు అధికంగా వినియోగించేవారు.

సన్నగిల్లిన వైభవం

సింగరాయకొండ మండలంలో పదేళ్ల క్రితం లారీలు, టిప్పర్లు, ట్రాలీలు, ఆటోలు కలిపి సుమారు 2 వేలకు పైగా ఉండగా ప్రస్తుతం కేవలం 600 లారీలు, ట్రాలీలు, 50 వరకు నాలుగు చక్రాల ఆటోలు, కార్లు ఉన్నాయి. ఏళ్లు గడిచేకొద్దీ ట్రాన్స్‌పోర్ట్, ఆటోమొబైల్ రంగంలో సింగరాయకొండ వైభవం సన్నగిల్లింది. డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటినా అదే స్థాయిలో కిరాయి మాత్రం పెరగలేదు.

దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పన్నుల విధానంతో లారీ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫైనాన్స్ కంపెనీలపై ఆధారపడి లారీలు కొనుగోలు చేసిన యజమానులు చివరికి ప్రతి నెలా చెల్లించాల్సిన కిస్తీలు కూడా కట్టలేని పరిస్థితి తలెత్తింది. దీనికి తోడు ఆటోమొబైల్ రంగంలో అనుభవం ఉన్న వర్కర్ల కొరత కూడా ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని వేధిస్తోంది. ఇటీవల కాలంలో రైలు రవాణా పుంజుకోవడం ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం దెబ్బతినడానికి మరో కారణమైంది. డ్రైవర్లు, క్లీనర్లుగా పనిచేస్తామని వచ్చేవారికి అడ్వాన్స్‌ల రూపంలో భారీగా నగదు చెల్లించాల్సి వస్తోందని, అయితే వారు ఎంతకాలం పనిచేస్తారో కూడా తెలియడం లేదని లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆటోమొబైల్స్‌పై తీవ్ర ప్రభావం

ట్రాన్స్‌పోర్ట్ లారీలు, టిప్పర్లు, ఇతర వాహనాలకు మరమ్మతులు చేసేందుకు సింగరాయకొండలో మెకానిక్ షెడ్లు, ఆటోమొబైల్ దుకాణాలు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. ఒకప్పుడు అన్ని రకాల దుకాణాలు కలిపి 300 వరకు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య సగానికి పడిపోయింది. కాలక్రమేణా ఆటోమొబైల్ రంగం కుదేలవుతుండటంతో మెకానిక్‌లు, టింకరింగ్ పని, పంక్చర్ షాప్‌లపై ఆధారపడిన వందలాది కుటుంబాలు ప్రత్యామ్నాయ పనులపై దృష్టి సారిస్తున్నాయి.



> గతంలో ట్రాన్స్‌పోర్ట్, ఆటోమొబైల్ ఫీల్డ్ చాలా బాగుండేది. విజయవాడ తరువాత అందరూ సింగరాయకొండ వైపే చూసేవారు. కాలక్రమేణా వర్కర్ల కొరత ఏర్పడటంతో మేము కూడా వేరే రంగాలపై దృష్టి సారించాల్సిన దుస్థితి ఏర్పడింది.
>
> – షేక్ పటేల్, లారీ ఓనర్, సింగరాయకొండ

వృద్ధురాలిపై హత్యాచారం

- పోలీసుల దర్యాప్తులో వెల్లడి


మాట్లాడుతున్న సీఐ రాములు నాయక్

యర్రగొండపాలెం: బహిర్భూమికి వెళ్లిన వృద్ధురాలిపై రాయితో దాడిచేసి ఆమె స్పృహ కోల్పోయిన తరువాత అత్యాచారం చేశాడని, ఆ తరువాత మరోసారి రాయితో కొట్టి హత్యచేశాడని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం సీఐ కె.రాములు నాయక్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘటనతో సంబంధం ఉన్న నిందితుడు సోనధర్ కశ్యప్ (20) ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలోని తీర్ధా గ్రామానికి చెందినవాడని, అతను మాచర్ల రోడ్డులోని సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడని ఆయన తెలిపారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 10.30 గంటల సమయంలో స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన 78 ఏళ్ల వృద్ధురాలు సమీపంలోని శ్మశాన వాటిక వద్దకు బహిర్భూమికి వెళ్లింది. అక్కడ కాచుకొని ఉన్న నిందితుడు ఆమెపై దాడికి పాల్పడి అత్యాచారం చేశాడని, అనంతరం రాయితో ఆమె తలపై కొట్టి హత్య చేయడంతోపాటు ఆమె వద్ద ఉన్న రూ.1500 తీసుకొని వెళ్లాడని ఆయన తెలిపారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించామని, అతను నేరం చేసినట్లు అంగీకరించాడన్నారు. నిందితుడు కశ్యప్ వాటర్ సర్వీసింగ్ పాయింట్‌లో పని చేస్తూ చెడు అలవాట్లకు బానిస కావడం వలన ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఆయన తెలిపారు. నిందితుడిని సర్వీసింగ్ సెంటర్ వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు

- సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి
- మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశంలో కలెక్టర్ దినేష్ కుమార్
- పాల్గొన్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఎస్పీ, ఏఎస్పీ

ఒంగోలు అర్బన్: మాదకద్రావ్యాలు వాడకాన్ని, రవాణాను అరికట్టేందుకు జిల్లాలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తద్వారా జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశంభవనంలో బుధవారం జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు దుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ఉండాలని అందుకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల నివారణ, రవాణాను అరికట్టేందుకు సంబంధిత అధికారులంతా ప్రణాళికబద్ధంగా సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో డి అడిక్షన్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా సంస్థల్లో ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో గంజాయి సరఫరాపై నిఘా ఉండాలని, మాదక ద్రావాల వినియోగం, విక్రయం, రవాణా వంటి వాటిని తీవ్రంగా పరిగణించాలన్నారు. పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆ విషయం ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఉండాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి కాలేజీలో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీలు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఫ్యాక్టరీల్లో పనిచేసేందుకు వచ్చే వలస కార్మికులు గంజాయి ఇతర మాదక ద్రవ్యాలను ఫ్యాక్టరీల్లోకి అక్రమంగా తరలించడం, సేవించడం వంటివి జరగకుండా యజమానులు పక్కాగా తనిఖీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రామాడాల్ టాబ్లెట్లు, ఇంజెక్షన్‌ల వాడకాన్ని డ్రగ్ కంట్రోల్ అధికారులు తరుచూ పర్యవేక్షించాలన్నారు. రవాణా వ్యవస్థపై నిఘా ఉంచామని, జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్నీ శాఖల సహకారంతో పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. వీటిని ఎవరూ రవాణా చేసినా, వినియోగించిన చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, డీటీసీ సుశీల, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, రిమ్స్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, అటవీ, డ్రగ్ కంట్రోల్, విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులోని ఓ గృహంలో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. వివరాలు.. తోళ్ల మడుగు సమీపంలోని ఓ గృహంలో మాచపోగు గ్లోరి, ప్రతాప్ దంపతులు నివాసం ఉంటున్నారు. ప్రతాప్ ఉద్యోగానికి, గ్లోరి తన పిల్లలకు అన్నం పెట్టేందుకు పాఠశాలకు వెళ్లారు. ఈ సమయంలో ఇంట్లోకి చొరబడిన దొంగ బీరువాలోని నగలు, నగదుతో ఉడాయిస్తుండగా గ్లోరి ఎదురైంది. చోరీ జరిగిందని గ్రహించి కేకలు వేయడంతో స్థానికులు దొంగను పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోటయ్య తెలిపారు.

20న ఎడ్ల బల ప్రదర్శన

పెద్దారవీడు: సద్గురు యోగానంద నరసింహ స్వామి, 68వ పుట్ట తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా పెద్దారవీడులో ఈ నెల 20న రాష్ట్ర స్థాయి సీనియర్ ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు.వివరాలకు 7013687472, 9966983148ను సంప్రదించాలని కోరారు.

అదృశ్యమైన ఆర్మీ జవాన్ మృతి


వీరబ్రహ్మానందరెడ్డి


భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కామూరి రమణారెడ్డి

కొమరోలు: గత నెలలో విధుల నిమిత్తం వెళ్లి అదృశ్యమైన ఆర్మీ జవాన్ మృత్యువాతపడ్డాడు. కొమరోలు మండలంలోని యర్రపల్లె గ్రామానికి చెందిన నారంరెడ్డి వీరబ్రహ్మానందరెడ్డి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని న్యూజల్పాయ్‌గురి క్యాంప్‌లో విధులు నిర్వహిస్తూ నెల రోజుల సెలవుపై వచ్చాడు. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపి జనవరి 10వ తేదీన విధుల్లో చేరేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎల్‌జీపీటీ రైల్వేస్టేషన్‌లో దిగి అదృశ్యమయ్యాడు. అక్కడ తను వదిలేసిన లగేజీని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వీరబ్రహ్మానందరెడ్డి ఆచూకీ కోసం గాలించడం ప్రారంభించారు. రెండు రోజుల క్రితం అక్కడి పోలీసులకు గుర్తు తెలియని మృతదేహం లభించడంతో కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించారు. వీరబ్రహ్మానందరెడ్డిగా నిర్ధారించుకుని కన్నీరుమున్నీరయ్యారు. పోస్టుమార్టం అనంతరం భౌతికకాయాన్ని బుధవారం యర్రపల్లె గ్రామానికి తీసుకొచ్చారు. అధికారిక లాంఛనాలతో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు కామూరి రమణారెడ్డి నివాళులర్పించారు. జవాన్ భౌతికకాయాన్ని సందర్శించేందుకు ప్రజలు వందల సంఖ్యలో తరలివచ్చారు. మృతునికి ఏడాది క్రితమే వివాహమైంది.

వలంటీర్ల వ్యవస్థ గొప్పది



వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సురేష్

సింగరాయకొండ(మర్రిపూడి): గ్రామ వలంటీర్లకు గుర్తింపు, గౌరవంతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సింగరాయకొండ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రాత్రి సింగరాయకొండ, జరుగుమల్లి, టంగుటూరు మండలాల గ్రామ వలంటీర్లతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 2.35 లక్షల మంది ఓటర్లు ఉంటే 1.80 లక్షల మందికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని, వీరందరికీ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు వచ్చేలా చేసిన ఘనత గ్రామ వలంటీర్లకే దక్కుతుందని కొనియాడారు. గ్రామ వలంటీర్ల వ్యవస్థ గొప్పతనాన్ని కాలమే నిర్ణయిస్తుందని మంత్రి సురేష్ అన్నారు.

50 శాతం అదనపు బహుమతి

గ్రామ వలంటీర్లు తమ పరిధిలోని 50 కుటుంబాల వారికి సేవలు సక్రమంగా అందించినందుకు వారికి సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర పతకాలు అందించి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ప్రభుత్వం నగదు బహుమతి అందిస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే నగదు బహుమతితో పాటు 50 శాతం అదనంగా అవార్డులు పొందిన వలంటీర్లకు తాను నగదు బహుమతి అందించనున్నట్లు ప్రకటించారు. ఇంతటి గొప్ప వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం దారుణమన్నారు. అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, మల్లవరపు రాఘవరెడ్డి, బత్తిన మదన మనోహర్, మండల జేసీఎస్ కన్వీనర్లు తన్నీరు సుబ్బారావు, తాడికొండ రామచంద్రరావు, ఎంపీటీసీలు గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపూరి శ్రీనివాసులు, షేక్ సలీంబాషా, షేక్ సలీం, సోమిశెట్టి సురేష్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

- ఎస్పీ పరమేశ్వరరెడ్డి హెచ్చరిక


పాత నేరస్తులను విచారిస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్ల ఇళ్లను పోలీసులు తనిఖీ చేసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం వారి పరిస్థితి, జీవనోపాధి, ఆదాయ వనరులు, రోజువారీ కార్యాకలాపాలు, కుటుంబ సభ్యుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రౌడీషీటర్ల కదలికలపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అశాంతిని సృష్టించినా, అక్రమాలకు పాల్పడినా శిక్ష తప్పదన్నారు.

దర్శి 'దేశం'లో భగ్గుమన్న విభేదాలు

- నియోజకవర్గ పరిశీలకుడుని తొలగించాలని తీర్మానం
- బ్రహ్మం చౌదరి తీరుపై కురిచేడు నాయకులు ఆగ్రహం
- 'యువగళం'పేరుతో లక్షలు దండుకున్నాడు..
- దిగజారిపోతున్న పార్టీ పరిస్థితి


బ్రహ్మంచౌదరిని పార్టీ నుంచి బహిష్కరించాలని తీర్మానం చేసిన నేతలు

కురిచేడు : దర్శి నియోజకవర్గం టీడీపీలో నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఏకంగా నియోజకవర్గ పరిశీలకుడిని వెంటనే తొలగించాలంటూ బుధవారం కురిచేడు మండల టీడీపీ నాయకులు తీర్మానం చేశారు. ఈ నియోజకవర్గానికి నాథుడు లేక అల్లాడుతున్న టీడీపీ ఈ పరిణామంతో పార్టీ పరిస్థితి మరింత దిగజారిపోనుంది. కురిచేడు మండల నాయకులు బుధవారం అత్యవసరంగా సమావేశమయ్యారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా ఉన్న నాదెండ్ల బ్రహ్మం తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలపై ఆయన కక్ష సాధింపు చర్యలు పాల్పడడం సరికాదని వారు విమర్శించారు. అందర్నీ కలుపుకొని పోకుండా సలహా ఇచ్చినవారిని సస్పెండ్ చేస్తానని బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపించారు. గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా లోకేష్ యువగళం సందర్భంగా రూ.20 లక్షల రూపాయలు చందాలు వసూలు చేసి లెక్కలు చెప్పకుండా దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బ్రహ్మం చౌదరి పై దొనకొండ మండలం నుంచి సైతం ఇదే తరహా ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, ఇలాంటి దోపిడీ దారులను ప్రోత్సహిస్తుంటే ఎలా అంటూ వారు వాపోతున్నారు. ఇలాంటి వ్యక్తులు ఉంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు వాస్తవాలు తెలుసుకుని బ్రహ్మం చౌదరిని పార్టీ నుంచి బహిష్కరించాలని తీర్మానం చేసి పార్టీ పెద్దలకు పంపారు.

మహనీయుడు దామోదరం సంజీవయ్య

- కలెక్టర్ దినేష్‌కుమార్


సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సెంట్రల్: పేదల సంక్షేమానికి విశేష కృషి చేసిన మహనీయుడు డాక్టర్ దామోదరం సంజీవయ్య అని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. డాక్టర్ దామోదరం సంజీవయ్య 104వ జయంతిని పురస్కరించుకొని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ ఎదురు ఉన్న డాక్టర్ దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన దామోదరం సంజీవయ్య నిరాడంబరతకు మారుపేరుగా, నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచి అందరికీ ఆదర్శ ప్రాయుడయ్యారని కొనియాడారు. ప్రజాహితం కోసం సామాజిక భద్రత వంటి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని, అలాంటి మహనీయుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని వారి సంస్కరణలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వారు చేపట్టిన సామాజిక భద్రత సంస్కరణ ఫలితంగా నేడు బడుగు బలహీన వర్గాల ప్రజలు పెన్షన్ పొందుతున్నారన్నారు. ఎంపీ మాగుంట శ్రీనువాసులరెడ్డి మాట్లాడుతూ బడుగు పేద ప్రజలకు మేలు జరగాలన్న లక్ష్యంతో డాక్టర్ దామోదరం సంజీవయ్య చేపట్టిన సంస్కరణలు నేటికీ ఆచరణలో అమలు జరుగున్నాయన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యమిచ్చి ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఆయన కారకులయ్యారని తెలిపారు. నేటి యువత వారి ఆశయాలను కొనసాగిస్తూ సంస్కరణలను కొనసాగించాలన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మట్లాడుతూ డాక్టర్ దామోదరం సంజీవయ్య గొప్ప సంస్కరణ వాది, నాయకుడని ఆయన దేశానికి, రాష్ట్రానికి నిస్వార్థమైన సేవలందించారని కొనియాడారు. అనంతరం ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో డాక్టర్ దామోదరం సంజీవయ్య విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, డీటీసీ సుశీల, డాక్టర్ దామోదరం సంజీవయ్య విగ్రహ కమిటీ ప్రతినిధులు వై అరుణ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.